ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
మంగళవారం | 15 జులై, 2025 | పేజీలు :06

## కుంట ఆక్రమణపై చర్యలు...


వివరాలు మొయిన్‌లో

# వేములవాడలో కూల్చివేత పనుల పరిశీలన

### గోశాల పరిసరాలు నిత్యం శుభ్రంగా ఉండేలా చూడాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో నిర్మాణాల కూల్చివేత పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. తిప్పాపూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా ఉన్న పలు నిర్మాణాలను అధికారులు సోమవారం ఉదయం కూల్చి వేయిస్తుండగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. రోడ్డు నిర్మాణంతో భక్తులు, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు.

**రాజన్న గోశాల ఆకస్మిక తనిఖీ..**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా గోశాలలోని జీవాలు, ఆవరణను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. గోశాల ఆవరణను నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ఇటీవల నియమించిన సిబ్బందికి డ్రెస్ కోడ్ వారి పేర్లతో ఉండాలని సూచించారు. జీవాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సంరక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

**విద్యార్థులతో పాఠాలు చదివించిన కలెక్టర్..**

తిప్పాపూర్ లోని ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠాలు చదివించారు. ప్రతి విద్యార్థితో అన్ని పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న కోడిగుడ్లు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పాఠాలు బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఆర్డీవో రాధాబాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్జీల పరిష్కారం

# సత్వరమే పూర్తి

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.ఓదెల మండలం పోత్కపల్లి గ్రామానికి చెందిన ఆర్. తిరుపతి కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిళ్ళ గ్రామ శివారులో ఉన్న చిన్న కుంట చెరువు శిఖం భూమి కొందరు గ్రామస్తులు కబ్జా చేసి వారి పేరు నమోదు చేసుకొని అక్రమంగా అమ్ముకుంటున్నారని, పందిళ్ళ శిఖం భూమి పరిశీలించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కాల్వ శ్రీరాంపూర్ కు రాస్తూ విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాలకుర్తి మండలం బామ్లా నాయక్ తండ గ్రామం మాజీ సర్పంచ్ & గ్రామస్తులు తమ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారుల జాబితా విడుదల చేయలేదని, గ్రామానికి సంబంధించిన అర్హుల జాబితా విడుదల చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత అధికారులకు రాస్తూ పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లి గ్రామానికి చెందిన జి. సదయ్య తాను దివ్యాంగుడినని తనకు గతంలో అంత్యోదయ బియ్యం కార్డు ఉండేదని 30 కోట్ల బియ్యం వచ్చేదని ప్రస్తుతం రావడం లేదని, తనకు 30 కేజీల అంజి ఉదయ కార్డు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ విచారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## వెనుకబడిన వర్గాలకు

# కాంగ్రెస్ ఎల్లవేళలా అండ

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయమని వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్న చౌక్ నుండి గాంధీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథిగా ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి లు మాట్లాడారు. వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ఆమోదం తెలిపినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేసి దేశ ప్రజల ఆకాంక్షలను రాహుల్ గాంధీ తెలుసుకున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని ఆయన ప్రకటించారనీ అన్నారు. కుల గణనను దేశ సామాజిక పరిస్థితులకు ఎక్స్‌రేగా రాహుల్ గాంధీ అభివర్ణించారు.రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు కామారెడ్డిలోనే డిక్లరేషన్ చేసారన్నారు. నాడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఆర్థిక, ఉద్యోగ రాజకీయ, కుల సర్వే ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదనీ చేతల ప్రభుత్వం అనడానికి ఇదే నిలువెత్తు నిదర్శనం అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కాకున్నా బీసీలకు అండగా ఉంటున్నారన్నారు. అసెంబ్లీలో బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ బిల్లు ప్రవేశ పెడితే దాన్ని నేను బలపరిచే అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతం అన్నారు.రానున్న ఎన్నికల్లో 42 శాతం బీసీ బిడ్డలు గెలవాలని ఆకాంక్షించారు.బీసీ కుల గణన చెసి రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉన్నట్లు లెక్కలు తీశారన్నారు. పదేళ్ల పాటు బీసీలను బీఆర్ఎస్ బిజెపి అన్ని విధాలా విస్మరించారని వారి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు.కుల గణన సర్వేను ఫెయిల్ చేయాలనే ఉద్దేశంతో కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ ఈ సర్వేలో పాల్గొనలేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, నాయకులు చొప్పదండి ప్రకాష్, ఆకునూరి బాలరాజు, సూర దేవరాజు, గడ్డం నరసయ్య, ఎల్లే లక్ష్మీ నారాయణ, పర్శ హనుమాన్లు, కాముని వనిత,కల్లూరి చందన, టోనీ, మడుగు శ్రీదేవి, శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ట్రినిటీ స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:** కరీంనగర్‌లోని ట్రినిటీ ద స్కూల్ ఆఫ్ లర్నింగ్ పాఠశాలలో సోమవారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించారు. విధ్యార్థులు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుని ఉత్సాహంగా ఓటు వేశారు. స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, డిసిప్లిన్ కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్, కల్చరల్ కెప్టెన్, హౌజ్ కెప్టన్లు( ప్రతి హౌజ్‌కు ఒక్కరు) చొప్పున ఎన్నికయ్యారు. ఈ సంధర్భంగా చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి . ప్రిన్సిపాల్ రత్నమాలలు ఎన్నికైన వారిని అభినందించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల ప్రక్రియ విధ్యార్థులలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. నాయకత్వ లక్షణాలు, సమయపాల, బాధ్యతాభావం వంటి ముఖ్యమైన నైపుణ్యాలను అలవర్చే అవకాశమని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నా ప్రతి ఒక్క విధ్యార్థి విజేతనేనన్నారు. ఇది ఒక అభ్యాసమని, భవిష్యత్ నాయకుల కోసం తాము అందిస్తున్న బలమైన వేదిక అని పేర్కొన్నారు. ఎన్నికైన విధ్యార్థుల వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించనున్నట్లు స్కూల్ యాజమాన్యం పేర్కొంది.




## నగునూరు ప్రభుత్వ పాఠశాలలో సైకిళ్ల పంపిణీ

**ప్రజాపక్షం/కొత్తపలి:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన సంధర్భంగా మోడీ కానుక పేరుతో పంపిణీ చేస్తున్న సైకిళ్లను సోమవారం కరీంనగర్ రూరల్ మండలం నగునూరు ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి విధ్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్, ఎంఈవో రవీందర్, ఎంపిడివో సంజీవరావు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆద్వర్యంలో 72 మంది విధ్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, బిజెపి నాయకులు దేవేందర్, రాఘవేందర్, దీపక్, తేజ మహేందర్, శ్రీనివాస్ రాజు, శేఖర్, వినయ్, సంతోష్, అజయ్ తదితరులున్నారు.

## బహు జనగణమన పుస్తకావిష్కరణ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాల వద్ద సోమవారం జూలూరి గౌరీ శంకర్ రచించిన బహుజనగణమన పుస్తకాన్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల బాధలతో పాటు బహుజనలకు రాజ్యాధికార ఆవశ్యకతను కవితా సంపుటి రూపంలో తన భావాలను ఈ పుస్తక రూపంలో వ్యక్తపరిచారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, అత్తె చంద్రమౌళి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్ రావు, సర్పంచ్ ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నూనె కుమార్ , మాజీ సర్పంచ్ ఇల్లందుల అశోక్ గౌడ్, షేర్ స్వామి,ఓడ్నల రాజు,మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపిటిసి లతోపాటు టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అమరేందర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, జ్వరంతోపాటు తదితర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి సుమారుగా 100మంది రోగులు హాజరయ్యారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారికి ముందస్తుగా రోగనిర్ధారణ జరగడంతోపాటు జాగ్రత్తల గురించి డాక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణలో జూడో క్రీడాభివృద్ధికి విశేష కృషి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణ క్రీడా రంగం దిన దినాభివృద్ధి చెందుతోందని , అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామాన జూడో క్రీడకు విశేష ఆదరణ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ జూడో సంఘం అధ్యక్షుడు కైలాస్ యాదవ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌ల్లో హోటల్ తారక్‌లో జిల్లా జూడో సంఘం కార్యవర్గ సమావేశంతో పాటు నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఈ సంధర్భంగా కైలాష్ యాదవ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన తెలంగాణలో జూడో క్రీడాకారులకు కొదువ లేదని, భవిష్యత్తులో ఒలంపిక్ స్థాయికి ఎదగాలన్నారు. జూడో క్రీడ రాష్ట్రంలో క్రేజీ గేమ్‌గా అవతరించబోతున్నదని తెలిపారు. ప్రతి ఒక్కరు యుద్ధ క్రీడ లాంటి జూడోలో శిక్షణ తీసుకోవాలని సూచించారు. తెలంగాణ జూడో సంఘం అధ్యక్షుడు కైలాష్ యాదవ్, సంయుక్త కార్యదర్శి సంతోష్, టెక్నికల్ చైర్మన్ రాములు మాట్లాడుతూ తెలంగాణలో జూడో క్రీడల్లో



అత్యుత్తమంగా శిక్షణ కార్యక్రమాలు జరిగేలా త్వరలోనే అకాడమీలు సంఘం ఆద్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కరీంనగర్ జిల్లా జూడో సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాదవేని వినయ్, ప్రధాన కార్యదర్శిగా దామోదర్, కోశాధికారిగా ఎండి మన్నాన్, ఉపాధ్యక్షులుగా గొర్రె శ్రీనివాస్, వాసు, క్రాంతి, బత్తిని జ్యోతి, జాయింట్ సెక్రటరీలుగా శ్రీకాంత్, చంద్రబాబు, రవీంద్రచారి, శ్రీలత, సాయి అరుణ్, సుధాకర్, షాబీర్ పాషా, సలహదారులుగా ఎం.మునీందర్‌లు ఎన్నికయ్యారు.

## మండల ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండాలి

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయాలని కొత్తపల్లి బిజెపి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఆద్వర్యంలో కార్యకర్తలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా కుంట తిరుపతి మాట్లాడుతూ కొత్తపెల్లి మండలంలోని మండల తహసీల్దార్, మండల పరిషత్, మండ వ్యవసాయ అధికారి, మండల విధ్యాధికారి కార్యాలయాలు ఒకే దగ్గర కాకుండా వేర్వేరు ప్రాంతాలో ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయాయరు. కరీంనగర్ పట్టణానికి కూత వేటు దూరంలో ఉండే గ్రామాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గంగాధరలో ఉందని, ఏదైనా పని పడితే 20 కిలోమీటర్ల దూరంలో వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ రిజిస్టర్



పరిధిలోకి కొత్తపల్లి మండలంలోని గ్రామాలను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు జవ్వాజి రమేష్, కడార్ల రతన్ కుమార్, కోమటి రెడ్డి అంజన్ కుమార్, వేముల అనిల్ కుమార్, బోనాల నరేష్, పొర్తి అనిల్, కడారి శ్రీనివాస్, బైరెడ్డి వంశీ, ఇల్లెందుల ఆనంద్, మెరుగు మల్లేశం, ఆరె నరేష్, చిన్నబోయిన శ్రీనివాస్, తదితరులున్నారు.

## ఆర్‌వోబిపై కాంగ్రెస్ నాయకుల చిల్లర రాజకీయాలు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఉప్పల్ ఆర్‌వోబి సమస్య కనీసం గుర్తుకు రాలేదా? కనిపించలేదా? అని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. జమ్మికుంటలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను



సోమవారం స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి గంగాడి పరిశీలించారు. రైల్వే అధికారులతో ఉప్పల్ రైల్వే స్టేషన్, ప్రయాణికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు చెప్పిన పలు విషయాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లి ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రధానంగా ఉప్పల్ ఆర్‌వోబి నిర్మాణాన్ని సత్వరం పూర్తి చేయించాలనే లక్ష్యంతో ఉన్నారని, ఆ దిశగా అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. నిర్మాణ పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్‌కు గడువు ఉందని, అయినా వారం లోపు పనులు పూర్తి చేసే బాధ్యతతో రైల్వే అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. కొంతమంది కాంగ్రెస్ పార్టీ నేతలు ఆర్‌వోబి నిర్మాణ పనులపై ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడడం, కేంద్ర మంత్రిపై అనవసర విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దశాబ్దాలు దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ ఏ రోజూ రైల్వే సమస్యలు, ప్రయాణికుల కష్టాల గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి మోదీ ప్రభుత్వం రైల్వేల అభివృద్ధి, ఆధునీకరణ కోసం కట్టుబవి పనిచేస్తుందన్నారు. ఆ దిశలోనే ప్రయాణికుల కష్టాలను తీర్చడానికి ఆర్‌వోబిల నిర్మాణాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్, జిల్లా నాయకులు బండారి సుధాకర్, తుమ్మ శోభన్ బాబు, భూపతి ప్రవీణ్ శెట్టి, సారంగపాణి, మోకెడె ప్రసాద్, చిట్టి సుందరయ్య, తూర్పాటి భాస్కర్, పోతిరెడ్డి శంకర్, పసునూటి రానా ప్రతాప్, దండబోయిన శ్రీనివాస్, ఎగ్గోజు శ్రీనివాస్, అక్కినపల్లి రవీంద్ర, సముద్రాల మొగిలి, తోట రాంప్రసాద్, శనిగరపు సంపత్, చేరాల రాంబాబు, చీర్స్ లచ్చన్న, రాజన్న తదితరులున్నారు.

## విద్యార్థులకు ట్రాక్ సూట్లు, యూనిఫాంలు పంపిణీ

**ప్రజాపక్షం/గంగాధర:** బిజెపి నాయకుడు కీ.శే పెరుక మల్లారెడ్డి జ్ఞాపకార్ధంగా ఆయన కుమారుడు చొప్పదండి బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్ ఆద్వర్యంలో సోమవారం గర్శకుర్తి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధ్యార్థులకు ట్రాక్ సూట్లు, యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కోల అశోక్, జిల్లా నాయకులు చిందం ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్యాంకుమార్, బిజెవైఎం మండల అధ్యక్షుడు దయ్యాల ప్రణయ్, యువమోర్చా నాయకులు తుమ్ కరుణాకర్, కొలిపాక తిరుపతి, శ్రీకాంత్, శ్రీనివాస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిఎస్ఆర్ ఐటిఐలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని జిఎస్ఆర్ ఐటిఐ లో ఈ విద్యాసంవత్సరం ఐటిఐ పూర్తి చేసుకున్న విధ్యార్థులకు వరుణ్ మోటార్స్ ఆద్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి యేటా హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీల ఆద్వర్యంలో, వరుణ్ మోటార్స్ ఆద్వర్యంలో వందలాది మంది విధ్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోందని ప్రిన్సిపాల్ ముష్క వీర రాజు తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ విభాగంలో ప్రముఖ కంపెనీలలో మంచి వేతనంతో ఉపాధి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసర ప్రాంత విధ్యార్థులు తమ కళాశాలలో చేరి ఉన్నత ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. వరుణ్ మోటర్ హెచ్ఆర్ క్రాంతి కుమార్, జమ్మికుంట ఇంచార్జి సంతోష్, ఇన్స్ట్రక్టర్స్ రవీందర్ రెడ్డి, రంజిత్, శైలజ, శ్రీనివాస్, శివ, ప్రసాద్, విద్యాసాగర్, మధుకర్, విధ్యార్థులున్నారు.

## కారోబార్ కార్మికుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం పంచాయతీ కార్మికులతో కలిసి కారోబార్ కార్మికుడిపై జరిగిన దాడికి కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. ఈ సంధర్భంగా కొప్పుల శంకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు భద్రత లేకుండా, భరో లేకుండా, ప్రజల్లో చులకన భావంతో చూస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై నానా దుర్భాషలాడి దాడి చేసిన వ్యక్తులపై వెంటనే పోలీస్ శాఖ, చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో యూనియన్ ఆద్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ విధులను నోటీసు ఇచ్చి బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు కొత్తూరు మల్లయ్య, మండల నాయకులు రాచపల్లి మొగిలి, చందగల కుమార్, రాకేష్, దేవేందర్, మల్లేష్ తదితరులున్నారు.

## ఎమ్మెల్సీగా కొనసాగే నైతిక హక్కు తీన్మార్ మల్లన్నకు లేదు

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల అర్బన్ రూరల్ రాయికల్, సారంగాపూర్ మండల పోలీస్ స్టేషన్ లలో బి.ఆర్.ఎస్ నాయకులు జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో సోమవారం రోజున కల్వకుంట్ల కవితక్క పై తీన్మార్ మల్లన్న అనుచిత వాక్యాలు చేసిన సందర్భంగా వారిపై చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ కవిత మీద అనుచిత వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.మల్లన్న వ్యాఖ్యలు మహిళ సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు కాపాడిన కల్వకుంట్ల కవితక్క బీసీల కోసం పోరాటం చేస్తే ఒక బీసీ బిడ్డవై ఉండి ఇలాంటి నీచపు వ్యాకాలు చేయడం యావత్ మహిళా సమాజాన్ని అవమానించినట్లే అని అన్నారు. ఎమ్మెల్సీగా కొనసాగే నైతిక హక్కు తీన్మార్ మల్లన్నకు లేదని అన్నారు. నిరసన తెలపడానికి వచ్చింది బీసీ బిడ్డలే అని తెలిసి కూడా వాళ్ళ మీద దాడులు చేయించడం అంటేనే బీసీ సమాజానికి నీవు ఏమి సందేశం ఇస్తున్నావో అర్ధం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాక్స్ చైర్మన్లులు, మాజీ ఏఎంసి చైర్మన్లులు, మాజీ కౌన్సిలర్లులు, మాజీ సర్పంచ్లులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజా ప్రతినిధులు బి.ఆర్.ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత



**ప్రజాపక్షం/ముత్తారం :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని డివిల్పిఓ కోమ్మెర సతీష్ కుమార్ పేర్కొన్నారు.సోమవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామాన్నిడివిల్పిఓ కొమ్మెర సతీష్ కుమార్, ఎంపీడీవో సురేష్, ఎంపీ ఓ భాస్కర్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్ర ప్రాంతాలు, డ్రైయిన్స్, సీజనల్ జ్వరాల గురించి ఇళ్లను విచారించడం జరిగిందన్నారు.చెంచు వారితో వారి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శ్మశానవాటిక వినియోగం, సెగ్రిగేషన్ షెడ్‌ను సరిగ్గా నిర్వహించడం, కంపోస్ట్‌ను వెంటనే తయారు చేయడం గ్రామ పంచాయతీలో అత్యుత్తమ పారిశుధ్యం పచ్చదనాన్ని విఫలం లేకుండా నిర్వహించడంపై పంచాయతీ కార్యదర్శి రవీందర్ కి సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రవీందర్, రాజేందర్, గ్రామపంచాయతీ సిబ్బంది తో పాటు తదితరులు ఉన్నారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో గ్రీన్ డే వేడుకలు

**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్:** పరిసరాల పరిరక్షణపై అవగాహన పెంపొందించడానికి గాను పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో సోమవారం రోజున గ్రీన్ డే ని ఎంతో ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకుపచ్చ వస్త్రధారణలో పాల్గొని పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ "మన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరికి పచ్చదనాన్ని పెంపొందించే బాధ్యత ఉంది. ఇది వర్షాకాలం కాబట్టి పిల్లలంతా తమకు ఇచ్చిన మొక్కలను నాటడమే కాకుండా, వాటి పరిరక్షణ కూడా చేసినట్లయితే మొక్కలు సంరక్షించబడతాయని, వృక్షో రక్షతి రక్షితః అన్న నానుడి నిజం చేయాలంటే మనందరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో , వాతావరణ సమతుల్యతలో మన వంతు పోషించాల్సిన అవసరం ఉందని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు గ్రీన్ డేపై పాటలు, నాటికలు, డ్రాయింగ్ ప్రదర్శనలు చేస్తూ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఉసిరి, దానిమ్మ, మునగ, బొప్పాయి, సీతాఫలం, మందార, గులాబీ, అలోవెరా, పచ్చ గన్నేరు తదితర పూల మరియు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ విధంగా పాఠశాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ఒక మంచి సందేశం సమాజానికి చేరవేస్తున్న గాయత్రి విద్యానికేతన్ యాజమాన్యాన్ని పోషకులు అభినందించారు. ఉత్సాహ భరితంగా సాగిన ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వికలాంగులకు పెన్షన్లు పెంచకపోతే ఉద్యమించుడే..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లను పెంచుతానని సీఎం ఎన్నికల ముందు హామీలు ఇచ్చారని అమలు పరచకపోతే పద్మశ్రీ మందకృష్ణ ఆదేశాల మేరకు ఉద్యమిస్తామని మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షులు కానపురం లక్ష్మణ్ మాదిగ ప్రభుత్వాన్ని నిలదీశారు. సోమవారం మండలంలోని దుమాల,అల్మాస్‌పురం గ్రామాలలో సమావేశం నిర్వహించి మీడియా ప్రకటన చేశారు. వికలాంగుల హక్కుల సమితి, చేయూత పిన్షన్‌దారుల సదస్సులు నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. వికలాంగులకు, వృద్ధాప్య పింఛను ఇస్తామని ప్రభుత్వం హామి ఇచ్చి మరిచిపోయిందని అన్నారు.
పింఛన్లను పెంచకపోతే ఊరుకోబోమన్నారు. సమావేశంలో వికలాంగులు గోపి, సంజీవ్, రాజిరెడ్డి, మల్లయ్య, మల్లయ్య, రాములు, లక్ష్మి, పోషరాములున్నారు.

## కంటి వెలుగునిస్తున్న శ్రీ వైద్య ఫౌండేషన్ మంథని



**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో దికొండ లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.శ్రీ వైద్య ఫౌండేషన్ సహకారంతో గ్రామస్తులకు షుగర్, బీపీ రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేశారు. అలాగే కరీంనగర్ సన్ రైస్ ఆసుపత్రి వైద్య సిబ్బంది గ్రామస్తులకు ఉచితంగా గుండె పరీక్షలు, మంథని లోని పటేల్ ఐ కేర్ ఆస్పత్రి వారు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు.నిరుపేద ప్రజల ఆరోగ్య సమస్యలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న, శ్రీ వైద్య ఫౌండేషన్, అలాగే సన్ రైస్ ఆసుపత్రి యాజమాన్యానికి దికొండ లక్ష్మణ్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ వైద్య ఫౌండేషన్ ఛైర్మన్ బుద్ధార్తి సతీష్ కుమార్,దికొండ లక్ష్మణ్ , సన్ రైస్ ఆసుపత్రి, మార్కెటింగ్ మేనేజర్ రాజేందర్ మార్కెటింగ్ , ఎక్స్యూటివ్ తిరుపతి, డాక్టర్ వెంకటేష్, ఆసుపత్రి మార్కెటింగ్ కోఆర్డినేటర్స్ సతీష్, ఫార్మసిస్ట్ నర్సింగ్ ఆఫీసర్స్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భూభారతిలో ప్రభుత్వ భూములను రక్షించాలి

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్ కి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూభారతిలో భూ కబ్జాదారులు అక్రమార్కులు ప్రభుత్వ భూములకు పట్టాల కొరకు దరఖాస్తులు పెట్టుకున్నట్లు మా దృష్టికి వచ్చిందని మంథని మున్సిపల్ పరిధిలోని రెవెన్యూ ఆబాది మున్సిపాలిటీ కి సంబంధించిన భూములు ఆక్రమణకు గురయ్యాయి అని మంథని నియోజకవర్గంలోని ఇతర మండలాలు గ్రామాలలో ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, బంజరు భూములు,దేవాదాయ భూములు గైరాన్ భూములు, అసైన్డ్ భూములు ఇనాం భూములు, చెరువు ఎస్సీ కార్పొరేషన్ భూములు, చెరువు శిఖం భూములను కొంతమంది కబ్జాదారులు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారని అన్నారు. అక్రమార్కులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి పట్టాల కోసం భూభారతిలో దరఖాస్తులు పెట్టుకున్నారని అన్నారు. ఆ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేసి ప్రత్యేక దృష్టి సారించి పట్టాలు చేయకుండా అడ్డుకట్ట వేసి భావితరాల కోసం ప్రభుత్వ భూములను రక్షించాలని కోరారు.ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాబు రవి ఉన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీ ఆర్ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్ నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు .సోమవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ ఉన్నత పాఠశాలలో 2025 పీ ఆర్ టీ యు సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పీ ఆర్ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి యాల్ల అమర్ నాథ్ రెడ్డి ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీ ఆర్ టీ యు తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు . ఉద్యోగులకు అన్ని రకాల జిపిఎఫ్, సరెండర్ , టి ఎస్ జి ఎల్ ఐ. పెండింగ్ బిల్లులు చెల్లించాలని సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసిందన్నారు. అన్ని కార్పొరేట్ హాస్పిటల్లో హెల్త్ కార్డులు వర్తించేటట్లు త్వరలో ఉత్తర్వులు విడుదలవుతాయని తెలిపారు.2024 సంవత్సరం నవంబర్ నెలలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సంఘం ప్రాతినిధ్యం చేసిందన్నారు . 2024 డీఎస్సీ ఉపాధ్యాయులకు అక్టోబర్ 10వ తేదీ నుంచి వేతనాలు చెల్లించే విధంగా ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డి ఆధ్వర్యంలో పీ ఆర్ టీ యు సంఘం ప్రాతినిధ్యం మేరకు ఉత్తర్వులు విడుదల కావడం జరిగిందని పేర్కొన్నారు.ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్మెంట్ కు సంబంధించిన ఉత్తర్వులు ప్రభుత్వ నిబంధన మేరకు జీవో 25, 11 లకు అనుగుణంగా సర్దుబాటు చేయాల్సిందిగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం పాఠశాల విద్యా సంచాలకులకు ప్రాతినిధ్యం చేసిందన్నారు. బదిలీలతో కూడిన పదోన్నతులకు పీ ఆర్ టీ యు సంఘం కట్టుబడి ఉందని త్వరలోనే ఉత్తర్వులు విడుదల చేయడానికి రాష్ట్ర సంఘం కృషి చేస్తుందన్నారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని కేజీబీవీ ఉపాధ్యాయులకు ఆప్షనల్ హాలిడేస్ వాడుకు నెలా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో పీ ఆర్ టీ యు గొల్లపల్లి మండల అధ్యక్షులు రాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చెన్న కరుణాకర్, సంధి శ్రీనివాస్ రెడ్డి, అయిల్నేని రత్నాకర్ రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రశాంతి, జిల్లా కార్యదర్శి నరేందర్ ,లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 17న జాబ్ మేళా నిర్వహణ

### జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్ లోని సుశ్రిత ఇన్ఫ్రా ప్రాజెక్టు లో ఉద్యోగాలు కల్పించుటకు జూలై 17న గురువారం రోజున రూమ్ నెంబర్ 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.సుశ్రిత ఇన్ఫ్రా ప్రాజెక్టు హైదరాబాద్ సంస్థలో 50 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 5 మార్కెటింగ్ మేనేజర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, పోస్టులకు 10వ తరగతి, ఇంటర్ డిగ్రీ ఎంబీఏ ఆ పై చదివి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 1835 లోపు, ఉండాలని, ఏటి పోస్టులకు పురుషులు మాత్రమే అర్హులని తెలిపారు.ఆసక్తి ఉన్నవారు జూలై 17న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో Room No. 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్తులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8121262441, 9866019365, 8985336947 ఫోన్ నెంబర్ ల నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

## నానో యూరియాపై సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న ఎరువుల డీలర్లకు జిల్లా అధికారుల ఆధ్వర్యంలో నానో యూరియా గురించి సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగ డీలర్లు అందరికీ నానో యూరియా ఆవశ్యకతనుమండల వ్యవసాయ అధికారి అనూష వివరించడం జరిగింది. అదేవిధంగా మండలంలోని ఎరువుల యొక్క లభ్యత, ఈ పాస్ మిషన్ ద్వారా క్రయవిక్రయాల గురించి విధి విధానాలను తెలియజేశారు.ఎరువుల యొక్క క్రయవిక్రయాలు తప్పకుండా ఈ పాస్ మిషన్ ద్వారానే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

## వామ్మో చిరుత సంచారమా..!

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండలంలోని రాగట్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలం పనులు చేస్తుండగా చిరుత కనబడటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి తోటి రైతుల వద్దకు పరుగులు తీశాడు.దీంతో రైతులు మూకుమ్మడిగా వెళ్ళి చూసే సరికి అక్కడి నుండి చిరుత వాగువంకలోకి పారిపోయిందని రైతులు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారికి సమాచారం ఇచ్చారు.ఘటన స్థలానికి వెంటనే చేరుకుని చిరుత పాదముద్రలను సేకరించారు.ఒంటరిగా తమ పొలాలకు వెళ్ళవద్దని పలు సూచనలు చేశారు.దిగులు చెందవద్దని ధైర్యంగా ఉండాలన్నారు.

## గ్రామ దేవతకు చీర ఓడి బియ్యం సమర్పణ

**ప్రజాపక్షం/మల్యాల:** చిలుకూరి బాలాజీ శివాలయ ప్రధాన అర్చకుడు,కొండ గట్టు గిరి ప్రదక్షిణ వ్యవస్థాపకుడు సురేష్ ఆత్మ రామ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం పురస్కరించుకొని మల్యాల మండలం ముత్యంపేట పోచమ్మ తల్లికి చీర కనుము, ఓడి బియ్యం, గాజులు తది తర పూజ సామాగ్రి నీ సోమవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దారం ఆది రెడ్డి, కొండబత్తిని అనిల్ కుమార్, తాటిపాముల జగదీశ్వర్ ,కాటిపల్లి శ్రీనివాస్, జీవన్, సాయి,రాజేశం తది తరులు పాల్గొన్నారు.

## తీన్మారు మల్లన్నపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/సారంగపూర్:** కల్వకుంట్ల కవిత పై ఒక మహిళ అని చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా కేసు నమోదు చేయాలని సోమవారం జగిత్యాల జిల్లా సారంగపూర్ పోలీస్ స్టేషన్‌లో బిఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ఆడబిడ్డల బతుకమ్మ, గౌరమ్మల గౌరవిస్తామని ఆడబిడ్డ ఎంఎల్‌సికవిత పై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలాధ్యక్షులు తేలు రాజు, ప్రధాన కార్యదర్శి ఆనంతుల గంగారెడ్డి , సీనియర్ ఉద్యమ నాయకులు బైరి మల్లేశం, వొద్నాల జగన్, చుక్క అంజి, సాంబారి గంగాధర్, మ్యాకల జలంధర్, అత్తినేని నరేష్, హనుమాండ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మల్లన్నపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి

## బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

**ప్రజాపక్షం/బోధన్‌:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్న పై చట్ట ప్రకరారం చర్యలు తీసుకోవాలని బోధన్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం బోధన్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు పట్టణ సిఐ వెంకట్ నారాయణకు మల్లన్నపై ఫిర్యాదు చేశారు. ఆయన చేసిన వాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని వారు విమర్శించారు. భేషరత్తుగా మల్లన్న కవితకు క్షమాపణలు చెప్పాలేని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యులు పెర్క రామకృష్ణ, బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు రవి శంకర్ గౌడ్, బోధన్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు రవీందర్ యాదవ్, శంకర్ పాల్గొన్నారు.

# తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దగ్ధం



**ప్రజాపక్షం / నందిపేట్ :** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై, మహిళలపై ఎలాంటి గౌరవం లేకుండా పరుష పదజాలంతో ప్రవర్తించినందుకు నిరసనగా తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను బిఆర్ఎస్ నాయకులు దగ్ధం చేశారు. సోమవారం స్థానికంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ పదవి నుండి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అందరు పోలీసు స్టేషన్ వెళ్ళి మల్లన్నపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మచ్చర్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# యువకుడిపై కత్తులతో దాడి



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో యువకుడిపై కత్తులతో జరిగిన దాడి స్థానికంగా కలకలం రేపింది. ఆదివారం రాత్రి రామకృష్ణాపూర్‌కు చెందిన కొమ్ము సంతోష్‌పై కొందరు యువకులు కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. వ్యాపార వ్యవహారాలకు సంబంధించి అదే ప్రాంతానికి చెందిన దుర్గం వెంకటేష్, సంతోష్‌ల మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయని, ఈ నేపథ్యంలోనే సంతోష్‌పై దాడి జరిగినట్లు అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంతోష్‌ను కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సంతోష్ భార్య మల్లీశ్వరి తెలిపిన వివరాల ప్రకారం.. దాడి జరిగిన రాత్రి బొల్లం అంజి అనే వ్యక్తి సంతోష్‌కు ఫోన్ చేసి వెంకటేష్‌తో ఉన్న గొడవ గురించి మాట్లాడాలని పిలిచాడు. సంతోష్ అంజి దగ్గరికి వెళ్లగా, అక్కడ వెంకటేష్, అతని కుటుంబ సభ్యులు, బొల్లం అంజి కలిసి తన భర్తపై దాడి చేసి చంపే ప్రయత్నం చేశారని మల్లీశ్వరి ఆరోపించింది. తమ కుటుంబానికి బొల్లం అంజి, వెంకటేష్, అతని కుటుంబ సభ్యుల నుండి ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ మల్లీశ్వరి ఓ వీడియోను విడుదల చేసింది. తన భర్తపై జరిగిన దాడిపై పోలీసులు న్యాయపరమైన విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

# త్వరితగతిన ఇండ్లను నిర్మించుకునేలా చూడాలి

## ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/బోధన్‌:** లబ్ధిదారులు ఇండ్లను త్వరితగతిన నిర్మించుకునేలా చూడాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో జనరల్ పంక్షన్ హాల్‌లో వర్ని, చందూర్, మోస్రా, కోటగిరి, రుద్రూర్, పోతంగల్ మండలాల ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణంపై సంబంధిత అధికారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇండ్లను నిర్మించుకునే లబ్ధిదారులకు సహకరించాలని, సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకవచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, వర్ని మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు సురేష్ బాబా, కోటగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గైక్వాడ్ హనుమంతు, వర్ని, చందూర్, మోస్రా, కోటగిరి, రుద్రూర్, పొతంగల్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బహిరంగ సభను జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/బోధన్‌:** బోధన్ పట్టణంలో జూలై 16న ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని బోర్డు నిర్వహకులు పిలుపునిచ్చారు. సోమవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల ఓ పంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, ఎంఐఎం బోధన్ పట్టణ అధ్యక్షులు మీర్ ఇలియాస్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు బిల్లు సవరణలకు వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేయడానికి వీలుగా ఈ సమావేశం నిర్వహించామన్నారు. ఈ నెల 16న సాయంత్రం ఏడు గంటలకు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించే బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు హజరత్ మౌలానా ఖలేద్ సైపుల్లా రహమాని మౌలానా ముక్తి ఖలీల్ హైమద్, హజరత్ మౌలానా కయాజ్, హైమద్ ఇసాదీ, హజరత్ మౌలానా, ఉమేర్ హబీద్ దిన్,ముక్తి సయ్యద్ జియాద్దీన్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరవుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో మౌలానా ముక్తి అతిక్ హైమద్, అబ్దుల్ బాకీ, మహమ్మద్ ఫారుఖి తదితరులు పాల్గొన్నారు.

# సినారె పురస్కారానికి డాక్టర్ దామెర రాములు ఎంపిక..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** మహాకవి సినారె జయంతి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా రచయితల సంఘం ప్రకటించిన పురస్కారాలకు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యులు,కవి డాక్టర్ దామెర రాములు ఎంపికయ్యారు.ఈ నెల 27న భువనగిరిలో నిర్వహించనున్న కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి మహాకవి సినారె సాహితి, పురస్కారానికి ఉమ్మడి జిల్లాల వారీగా కవులు,రచయితలను ఎంపికప చేవారని పేర్కొన్నారు.ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి తనకు స్థానం లభించిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవులు,రచయితలు,కళాకారులు తదితరులు ఆయనను అభినందించారు.

# నవోదయ విద్యాలయంలో ప్రవేశంపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం / ఆర్మూర్ :** జన్ వికాస్ సమితి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం చేపూర్, పల్లె (హరిపూర్) గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్ష కొరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రవేశం కొరకు శిక్షణ తరగతులు, ఫీజు కూడా ఆర్గనైజేషన్ వారు చెల్లిస్తారని వారు ఈ సందర్బగా విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రదానోపాధ్యాయులు కృష్ణ, గంగారాం, ఉపాధ్యాయ బృందం జన్ వికాస్ సమితి ఆర్గనైజేషన్‌సభ్యులు ఎం. గిరీష్, ఎం. హరీష్, రేగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆధ్వర్యంలో జామెంట్రి బాక్స్ పంపిణీ




**ప్రజాపక్షం/బోధన్‌:** బోధన్ మండలంలోని ఏరాజ్‌పల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని ఆధ్వర్యంలో విద్యార్థులకు జామెంట్రీ బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని రీజియన్ ఛైర్మన్ పావులూరు వెంకటేశ్వర్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ భవాని అధ్యక్షులు గణపురం అశోక్, కాట్రగడ్డ భారతి, నల్వాల కృష్ణ సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన




**ప్రజాపక్షం/బోధన్‌:** నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసులు సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణ సిఐ వెంకట్ నారాయణ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలపై, యాంటి ర్యాగింగ్ తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెర్చరర్లు చిరంజీవి, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర సేవల వేగవంతానికి కొత్త పుంతలు..

## డయల్ 100 వాహనాలకు అత్యాధునిక జీపిఆర్ఎస్ అమరిక..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అత్యవసర పరిస్థితుల్లో పౌరులకు వేగవంతమైన,పారదర్శకమైన సేవలు అందించడంలో నిర్మల్ జిల్లా పోలీసులు మరో అడుగు ముందుకేశారు.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల రక్షణకు నిరంతరం అందుబాటులో ఉండే మొత్తం 100 డయల్ 100 పోలీష్ వాహనాలకు అత్యాధునిక గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జిపిఆర్ఎస్)పరికరాలను అమర్చారు.ఈ నూతన సాంకేతిక వ్యవస్థ డయల్ 100 సేవలను గణనీయంగా మెరుగుపరచడమే కాకుండా,పోలీస్ స్పందన సమయాన్ని మరింత సమర్థవంతంగా మార్చనుంది.

**సాంకేతికతతో మెరుగైన పోలీసింగ్..**

ఈ ఆధునిక జిపిఆర్ఎస్ వ్యవస్థ అమరికతో,అత్యవసర కాల్ వచ్చినప్పుడు,కాల్ సెంటర్ ఆపరేటర్లు ఘటనా స్థలానికి అత్యంత సమీపంలో ఉన్న పోలీస్ వాహనాన్ని తక్షణమే గుర్తించి,దానికి మార్గనిర్దేశం చేయగలుగుతారు.పోలీస్ వాహనాల కదిలికలు,అవి ఉన్న ప్రదేశం,వాటి ప్రస్తుత స్థితి వంటి సమగ్ర సమాచారం జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు నిజ సమయంలో(రియల్ టైమ్)అందుబాటులో ఉంటుంది.దీనివల్ల అనవసర జాప్యం లేకుండా,సరైనా వాహనాన్ని సరైన సమయంలో సంఘటన స్థలానికి పంపడం సాధ్యమవుతుంది.సాంకేతిక పురోగతి పోలీస్ రెస్పాన్స్ టైమ్ ను అంటే అత్యవసర పరిస్థితులకు స్పందించే సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది.ఇది బాధితులకు తక్షణ సహాయం అందించడానికి,నేరాలను నియంత్రించడానికి,శాంతిభద్రతలను కాపాడటానికి కీలకం,వేగవంతమైన స్పందన వల్ల ప్రాణానష్టాన్ని తగ్గించవచ్చు,ఆస్తి నష్టాన్ని నివారించవచ్చు,నేరస్తులను త్వరగా పట్టుకోవచ్చు.

**పారదర్శకత,జవాబుదారీతనం పెంపు..**

ఈ చర్య పోలీస్ వ్యవస్థలో పారదర్శకతను,జవాబుదారీతనాన్ని మరింత పెంచుతుందని జిల్లా పోలీస్ అధికారులు పేర్కొన్నారు.ప్రతి డయల్ 100 వాహనం యొక్క కదలికలను పర్యవేక్షించడం ద్వారా,సేవలను మరింత సమర్థవంతంగా,జవాబుదారీగా అందించడానికి వీలవుతుంది.పౌరుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ,పోలీస్ సేవలను మరింత ప్రజలకు చేరువ చేయడానికి,వాటి నాణ్యతను పెంచుడానికి ఈ జీపిఆర్ఎస్ అమరిక ఒక కీలకమైన చర్యగా అభివర్ణించారు.భవిష్యత్తులో పోలీసింగ్‌లో ఆధునిక సాంకేతికతను మరింతగా అనుసంధానించడానికి ఇది మార్గం సుగమం చేస్తుందని,తాద్వారా నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతలను పటిష్టం చేయడంలో ఇది ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభిస్తుందని జిల్లా అధికారులు నొక్కి చెప్పారు

## ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం

ప్రజాపక్షం / తాండూరు : తాండూరు మండలం అచ్చలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పుప్పాల పూజిత, సముద్రాల జస్వంత్ ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించిన సందర్భంగా సోమవారం వారిని పాఠశాలలో ఘనంగా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం వారికి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 2024, 2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన పుప్పాల పూజితకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కె. శ్రీనివాస్ పది వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలి

ప్రజాపక్షం / జన్నారం : గుడిహత్నూర్ నుంచి జన్నారం మీదుగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భారీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జన్నారం మండల అభివృద్ధి కమిటీ సభ్యులు అటవీ డివిజనల్ అధికారి (ఎఫ్‌డిఒ)కి వినతిపత్రం అందజేశారు. భారీ వాహనాల రాకపోకలపై ఉన్న ఆంక్షల వల్ల జన్నారం మండలం అభివృద్ధి చెందడం లేదని, యువతకు ఉపాధి అవకాశాలు లభించడం లేదని వారు పేర్కొన్నారు. ఈ ఆంక్షలను ఎత్తివేయడం ద్వారా మండల అభివృద్ధికి తోడ్పడాలని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో భూమాచారి, జన్నారం మండల అభివృద్ధి కమిటీ సభ్యులు సాజిద్ అలీ, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్ రావు

ప్రజాపక్షం /తిర్యాణి : జిఒ 49 అమలుతో ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెడ్మ భగవంత్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తిర్యాణి మండలంలోని ఆదివాసి సంఘాల నాయకులు, ఆదివాసులు కలిసి స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్‌కు, తిర్యాని రేంజ్ అటవీ శాఖ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వెడ్మ భగవంత్ రావు మాట్లాడుతూ, జిల్లాలోని 339 గ్రామాలను టైగర్ కారిడార్‌గా మార్చే కుట్ర జరుగుతోందని, దీనివల్ల తిర్యాణి మండలంలోని 29 గ్రామపంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ముఖ్యంగా మండలంలోని గుండాల, మంగి, కొటగాం, పంగిడి మాధర గ్రామాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఒ 49ని రద్దు చేయాలని లేనిపక్షంలో ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బాధితులకు పరిహారం చెల్లించే వరకు పోరాటం ఆగదు

### రఘునాథ్ వెర్రబెల్లి బిజెపి రాష్ట్ర నాయకులు



ప్రజాపక్షం/ హాజీపూర్ : ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం సాగిస్తుందని బిజెపి రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెర్రబెల్లి స్పష్టం చేశారు. సోమవారం మంచిర్యాల జిల్లా గుడిపేట గ్రామంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు బాధితులు, వారి కుటుంబాలతో కలిసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించి హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారం వద్ద రఘునాథ్ వెర్రబెల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వం, అంతకుముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తిపడి బాధితులకు నష్టపరిహారం చెల్లించకుండానే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ఐటి పార్కుతో రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తానని చెప్పి, ఆ భూములపై ఆధారపడి బ్రతుకుతున్న వారి ఉపాధిని నాశనం చేస్తున్నారని, ఐటి పార్కు పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, ప్రాజెక్టు బాధిత రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో పొన్నారంలో వైద్య శిబిరం



ప్రజాపక్షం/మందమర్రి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పొన్నారం గ్రామపంచాయతీలో డాక్టర్ రాపాక రమేష్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల రూ. 1000 చొప్పున పోషణ భత్యంను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి క్షయ త్వరగా వ్యాపించే అవకాశం ఉందని, కాబట్టి అన్ని రకాల పోషకాహారాలు లభించే ఆహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ వ్యాధి తుంపర్ల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని, మద్యం సేవించేవారికి, పొగాకు నమిలేవారికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఎక్కువ అని హెచ్చరించారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి ఎక్స్ రేతో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా పొన్నారం హెల్త్ సెంటర్‌కు నూతనంగా వచ్చిన డా. శరత్‌కు పొన్నారం కాంగ్రెస్ నాయకులు మాసు సంతోష్ కుమార్, పెంచాల రాజలింగు, బొజ్జ రాములు, నీలం ఆనంద్, కోట భూషణం, నీలం రవి, బిఆర్‌ఎస్ మధుతో పాటు అధికారులు జిపి స్పెషల్ ఆఫీసర్ సునీత, ఎఇఒ తిరుపతి, సూపర్ వైజర్ విజయ, జిపి సెక్రటరీ హరీష్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరవ అధ్యక్షులు ఈద లింగయ్య, ఎఎన్‌ఎం గ్లోరీ, హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్, కుమారస్వామి, కారోబార్ బానేష్, లాస్కర్ భీమాలింగ్ లు శాలువాతో సన్మానం చేశారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణలో విద్యార్థులు కీలక పాత్ర

### ఎస్‌పి కాంతిలాల్ పాటిల్



ప్రజాపక్షం / కెరమెరి : మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కెరమెరి మండలంలోని మోడీ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. విద్యార్థులు, యువత ఈ ప్రమాదకర వలలో చిక్కుకోకుండా జాగ్రత్తపడాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా ఉంచుకొని, క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ మాత్రమే జీవితాన్ని సానుకూలంగా మారుస్తాయని ఉద్ఘాటించారు. మాదక ద్రవ్యాల వినియోగం, వాటి ప్రభావం, శారీరక, మానసిక హానిపై విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖ ఎప్పుడూ విద్యార్థులకు మద్దతుగా ఉంటుందని, అవసరమైన సలహాలు, సహాయానికి సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్‌కు గురైనట్లయితే వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలియజేశారు. డ్రగ్స్ గురించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే 1908 లేదా 8712670551 నంబర్‌కు కాల్ చేసి తెలపాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాల నియంత్రణ గురించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి జామ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రకాష్, వాంకిడి సిఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్‌ఐ మధుకర్, ఆత్రం లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్ దాస్, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేమెంతో మాకంత వాటా కావాలి..?

### మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు సామాజిక రిజర్వేషన్లు అయిన బీసీ డీ నుండి బీసీ ఏలోకి వెంటనే మార్చాలని ముదిరాజ్ అధ్యయన వేదిక అధ్యక్షుడు,మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ పేర్కొన్నారు.సోమవారం ఉదయం వెంగ్వాపేట్ గ్రామంలో నిర్వహించిన ముదిరాజ్ జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు.తదనంతరం జరిగిన ముదిరాజ్ ల సమావేశంలో పాల్గొని ఆయన ప్రసంగిస్తూ,ముదిరాజులు తెలంగాణ రాష్ట్ర జనాభాలో సుమారు 60 లక్షల మంది ఉన్నారని,వారు సామాజికంగా,ఆర్థికంగా,రాజకీయపరంగా అనిన రంగాలలో వెనుకబడి ఉన్నారని,కావున ముదిరాజులందరూ సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ముదిరాజులకు ప్రత్యేకమైన రిజర్వేషన్లను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదే విధంగా ప్రభుత్వం ఈ మధ్య కాలంలోనే హైకోర్టు సూచించిన విధంగా తెలంగాణ గ్రామాలలోని ప్రతి చెరువులో 18 సంవత్సరాలు నిండినముదిరాజు వ్యవసాయదారులకు సభ్యత్వాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజులకు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు జొజ్జ నారాయణ,సలేందర్ శివయ్య,బోండ్ల గంగాధర్,బర్మ రాజనర్సయ్య, అనిల్, కిష్టయ్య,దర్శనం దేవేందర్,దినేష్,సంతోష్,ఉమామహేశ్వర్,శంకర్,గంగాధర్,రాజేశ్వర్,శేఖర్‌ద,శ్రీనివాస్,బొజ్జ గంగన్న,పోశెట్టి,కృష్ణా ముదిరాజ్ మొదలగువారు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు యూనిఫాంలు, పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తాగునీటి సమస్య, సరిపోని మరుగుదొడ్లు, మూత్రశాలల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరగా, దీనికి స్పందించిన కలెక్టర్, త్వరలో గురుకుల పాఠశాలలను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టీకానంద్, గొడిసెల కార్తీక్, టీవీజీవీఎస్ జిల్లా అధ్యక్షులు కొరెంగ మాలశ్రీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సి మంచిర్యాల జిల్లా చైర్మన్‌గా శ్రీపతి రాములు

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) మంచిర్యాల జిల్లా చైర్మన్‌గా నస్పూర్ పట్టణానికి చెందిన శ్రీపతి రాములు గౌడ్ నియమితులయ్యారు. ఈ నియామకాన్ని స్టేట్ చైర్మన్ బిద్దిపడగ శ్రీనివాస్ రెడ్డి ధ్రువీకరించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపతి రాములు గౌడ్ మాట్లాడుతూ సంస్థ నియమ నిబంధనలను పాటిస్తూ, సంస్థ లక్ష్యాల సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తానని, ప్రతి పేదవాడికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని, పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడతానని పేర్కొన్నారు

## బడుగు బలహీన వర్గాల్లో స్ఫూర్తి "బహుజనగణమన" ఆవిష్కరణ



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : బడుగు బలహీన వర్గాల్లో చైతన్య స్ఫూర్తి కలిగించేందుకు ప్రముఖ కవి రచయిత జూలూరి గౌరీ శంకర్ రచించిన బహుజన గణమన అనే దీర్ఘ కవిత సంపుటి పుస్తకాన్ని నేడు నిర్మల్ జిల్లా నడిబొడ్డున గల కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ సముదాయంలో బహుజన నాయకులందరూ కలిసి ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రముఖ కవి డా.దామెర రాములు మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం సాక్షిగా అందరికీ సమాన ఫలాలు అందుతాయని తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయ కర్త డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు మాట్లాడుతూ జానభాలో సగం పైగా ఉన్నా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అందినప్పుడే ఆర్థిక సామాజిక రాజకీయ పురోగతి సాధ్యమని,మహాత్మ జ్యోతిబాపూలే స్ఫూర్తితో బలహీనవర్గాలందరూ ఏకతాటిగా ఉద్యమించాలని పేర్కొన్నారు.మరో అతిథి తుమ్మల దేవరావ్ మాట్లాడుతూ జూలూరి గౌరీ శంకర్ సామాజిక చైతన్య స్ఫూర్తిగా దీర్ఘకవ్యాన్ని రచించడం ఎంతో గొప్ప విషయం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు దామెర రాములు,ఉప్పు కృష్ణంరాజు,చిలుక రమణ,డా.వేణుగోపాల కృష్ణ,ఆరేపల్లి విజయ్ కుమార్,నేరెళ్ల హనుమంతు,కత్రోజే అశోక్,సిరికొండ రమేష్,బిట్లింగ్ నవీన్,నాగోరావ్,బొంపాల చిన్నయ్య పోలీస్ భీమేష్,శనిగారపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌కు సన్మానం..

ప్రజాపక్షం/తానూర్ : మండలానికి నూతనంగా నియమింపబడిన తాసిల్దార్ మహేందర్నాథ్ కు మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు కులకర్ణి శంకర్,వాగ్మారే నగేష్,ధర్మేంద్రపటేల్,శంకర్,దింగబర్,వినాయక్,గంగాధర్,రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో గోరింటాకు సంబరాలు..

ప్రజాపక్షం/తానూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఆషాడ మాస గోరింటాకు సంబరాలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థులకు గోరింటాకు పెట్టి దాని విశిష్టతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాలోడ్ సాయిబాబు పాఠశాల విద్యార్థులకు వివరించారు.గోరింటాకు ప్రకృతి పరంగా లభించినవి పెట్టుకోవడం ద్వారా చర్మ సమస్యలు,దరి చేరకుండా ఉంటాయని,గోరింటాకు పెట్టుకోవడం ద్వారా శరీరానికి చాలా చల్లదనాన్ని అందిస్తుందని, ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాధవరావు,శ్యామ్‌రావ్,పవార్ రమేష్ ,విజయ్ కుమార్,నరేందర్, సంజయ్, రాజేశ్వర్,నా గేంద్రర్, లక్ష్మి ,జ్యో తి,విద్యార్థిని,విద్యార్థులు,పాల్గొన్నారు.

## గుమాస్తా సంఘం ప్రధాన కార్యదర్శికి ఘనసన్మానం

ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : వ్యవసాయ మార్కెట్ కమిటీ అనుబంధమైన గుమాస్తా సంఘం ప్రధాన కార్యదర్శిని ఘనంగా సన్మానించామన్నారు. నగర మేరు సంఘం ఉపాధ్యక్షులు గట్ల సత్యం తమ్ముడు గట్ల శ్రీనివాస్ నిజామాబాద్ గుమాస్తా సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికై ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సమక్షంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇటీవల జరిగిన గుమాస్తా సంఘం ఎన్నికల్లో గట్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. సన్మానించిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షులు సోమ హన్మంత్‌రావు, ప్రధాన కార్యదర్శి కొట్టూర్ దేవదాస్, నగర అధ్యక్షులు మంతెన దశరథ్, జిల్లా కార్యదర్శి గట్ల నరేందర్ ఉన్నారు.

## దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



ప్రజాపక్షం/దాహేగాం/కాగజ్‌నగర్ : దాహేగాం మండలంలోని రాంపూర్, మొట్లగూడ గ్రామాల్లో వ్యవసాయ అధికారి రామకృష్ణ పర్యటించి, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రస్తుత పరిస్థితులలో పత్తి పంటలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఆయన వివరించారు. అధిక వర్షాలకు పత్తి చేలలో నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల మొక్కల వేర్లకు తగినంత ఆక్సిజన్ అందక ఆకులు ఎరుపు రంగులోకి మారడం, పంట ఎదుగుదల తగ్గిపోవడం, చివరికి పంట ఎండిపోవడం జరుగుతుందని తెలిపారు. పంట త్వరగా కోలుకోవడానికి చేల నుండి అదనపు నిల్వ ఉన్న నీటిని వెంటనే బయటకు తీసివేయాలని సూచించారు. అలాగే, మొక్కలు త్వరగా కోలుకోవడానికి, మొక్కల మొదళ్ల తడిచేలా 1 కిలో 191919 ఎరువు, 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 20 గ్రాముల ప్లాంటామైసిన్‌లను 200 లీటర్ల నీటికి కలిపి, ఒక ఎకరానికి 5, 7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని రామకృష్ణ రైతులకు సూచించారు. ఆయన వెంట పలువురు రైతులు ఉన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన ఆల్ ఇండియా సేవా బంజారా సేవా సంఘం ఎంప్లాయిస్ యూనియన్

ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఆదేశాల మేరకు జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతనంగా అధ్యక్షునిగా ఎన్నికైన రాంచందర్ నాయక్ అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఈ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా ఎవిఎస్.నరహరినాయక్, కోశాధికారిగా ధరమ్‌సింగ్‌నాయక్, ఆర్గనైజర్ సెక్రటరీగా ఎల్.రవీందర్‌లను ఎన్నుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఆదేశాల మేరకు వారి ప్రత్యేక చొరవతో ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులందరూ తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకుని బంజారా ఐక్యత ఏంటో మరోసారి చాటి చెప్పారన్నారు.

అదేవిధంగా ఈ పదవులు తమకు శాశ్వతం కాదని ముఖ్యంగా బంజారా ఉద్యోగుల సమస్యలను అలాగే తండాలలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే అంతవరకు ప్రభుత్వంపై ఒత్తి తీసుకవస్తామన్నారు. బంజారా ఉద్యోగులందరూ ఉద్యోగపరంగా ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ధైర్యంగా ముందుకొచ్చి తమ కార్యవర్గం దృష్టికి తీసుకవస్తే వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

## ఉదయం వేళ...అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ...



ప్రజాపక్షం/లోకేశ్వరం :ఉదయం వేళ ప్రతి రోజు ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ నివాసం లో జనసందడి అగుపడు తుంది.అందరిని ఆత్మీయంగా పలకరిస్తూ..సమస్యలు తెలుసుకుంటూ..అధికారులకు ఫోన్ చేస్తూ పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నారు.లోకేశ్వరం మండలంలోని వటోలికి చెందిన మహిళలు తమకు భవనం కావాలని,అడగగా 10 లక్షల రూపాయలు.వి.వో బిల్డింగ్ కోసం నిధులు మంజూరు చేస్తానన్నారు.ఈ సందర్భంగా ఓ పెద్దమ్మ మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ నాయకులు ఎమ్మెల్యే వద్దకు తీసుకు రాలేదని ఇక మంచి తాము నేరుగా వస్తామని సంతోషం వ్యక్తం చేశారు.అదేవిధంగా నియోజకవర్గం లోని పలు గ్రామాల నుండి నాయకులు ప్రజలు వచ్చి పలు సమస్యలు విన్నవించారు.తాము నేరుగా వచ్చి ఎమ్మెల్యేతో మాట్లాడగలుగుతున్నామని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వైభవంగా కామ్రేడ్ గుండా మల్లేశ్ జయంతి



ప్రజాపక్షం / బెల్లంపల్లి : గుండా మల్లేశ్ ఆశయ సాధన కోసం పట్టణ పార్టీ, సిపిఐ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని, బెల్లంపల్లిలో సిపిఐకి పూర్వ వైభవాన్ని తీసుకురావడంలో అందరూ కృషి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో సిపిఐ నేత అమరజీవి గుండా మల్లేశ్ 79వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి రాముడు లక్ష్మణ్ గుండా మల్లేశ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండా మల్లేశ్ భూమిలేని వారికి భూమి, ఇల్లు లేని వారికి ఇండ్లు కేటాయించిన నిస్వార్థ నేత, ఎనలేని సేవలు అందించారని, నాలుగు సార్లు ఎంఎల్‌ఏగా గెలిచి అవినీతికి తావు లేకుండా ప్రజాసేవకు పాటుపడ్డారు అని, తెలంగాణ రాష్ట్ర సాధనలో శ్రీకృష్ణ కమిటీ ముందు తెలంగాణ హక్కును గట్టిగా వినిపించారని అన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నరసయ్య మాట్లాడుతూ, గుండా మల్లేశ్ లేని లోటు ప్రస్తుతం మరింత తెలుస్తోంది. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల హక్కులను అణిచివేస్తున్న వేళ, ఆయన పోరాటాలు మరింత అవసరం అన్నారు. ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ మాట్లాడుతూ, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీల కోసం గుండా మల్లేశ్ ఎన్నో పోరాటాలు చేశారు. బెల్లంపల్లి అభివృద్ధికి బస్టాండ్, ఫ్లైఓవర్‌లు, ప్రాజెక్టులు సాధించారని తెలిపారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేష్ మాట్లాడుతూ, ఇంద్రవెల్లి స్థూపం ధ్వంసం అయినప్పుడు అసెంబ్లీలో గర్జించి పునర్నిర్మాణానికి ప్రధాన పాత్ర పోషించారని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టు నాయకులు ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ, మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు గుండా సరోజ, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్, బికెఎంయు జాతీయ సమితి సభ్యులు అక్క పెల్లి బాబు, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, బికెఎంయు జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, ఏఐకెఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి మేకల రాజేశం, కొండు బానేష్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు బొల్లం సోని, పట్టణ కార్యవర్గ సభ్యులు రత్నం రాజం, బొంకూరి రామచందర్, బండారి శంకర్, స్వామి దాస్, తిరుమల రాయమాలు, రవిశంకర్, జమున, సన్నార్తి తిరుమలేష్, గుండా ప్రశాంత్, గుండా శంకర్, సందీప్, కమల, పద్మ తదితరులు పాల్గొన్నారు.



## గుర్తింపు లేని పాఠశాలలను వెంటనే మూసివేయాలి..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రభుత్వ గుర్తింపు లేకుండా కొనసాగుతున్న పాఠశాలలను వెంటనే మూసివేయాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం సోమవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర అభిలాష అభినవ్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇష్టానుసారం నడుస్తున్నాయని,విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఈ పాఠశాలలు తల్లిదండ్రులను మోసపూరిత వాగ్దానాలతో ఆకర్షించి,గుర్తింపు లేకపోయినా విద్యార్థులను చేర్చుకుని,వారిని ఆర్థికంగా దోచుకుంటున్నాయని మహేందర్ అన్నారు.అంతేకాకుండా,ఈ పాఠశాలలు వేరే ప్రాంతాల్లోని తమ శాఖల నుండి సర్టిఫికెటును జారీ చేస్తూ ప్రభుత్వం,తల్లిదండులను మోసం చేస్తున్నాయని ఆయన తెలిపారు.నిర్మల్ లోని కొండాపూర్ ప్రాంతంలో ఉన్న శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల,నిర్మల్ పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాల వంటివి ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని మహేందర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.గుర్తింపు లేని అన్ని పాఠశాలలను వెంటనే మూసివేసి,వాటి యాజమాన్యాలపై నేరపూరిత కేసులు నమోదు చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పవార్ కిరణ్,జిల్లా సహాయ కార్యదర్శి రాజా,నాయకులు సిద్ధార్థ్,అద్విత్ తదితరులు పాల్గొన్నారు.

## 17 నుండి రాష్ట్ర స్థాయి జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీలు..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జులై 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్మల్ లోని కొండాపూర్ లో గల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్రస్థాయి జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టార్ మంచిర్యాల డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ముఖేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్ తెలిపారు.రాష్ట్రస్థాయిలో అండర్ 19 బాలుర,బాలికలకు సింగిల్స్,డబుల్స్,మిక్స్ డబుల్స్ వి భాగాలలో బ్యాడ్మింటన్ పోటీలు ఉంటాయని తెలిపారు.జులై 17న క్వాలిఫైయింగ్ పోటీలు,జులై 18 నుంచి 20వ తేదీ వరకు మెయిన్ డ్రా పోటీలు ఉంటాయని తెలిపారు.18వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవం ఉంటుందని ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తో జిల్లాలోని ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ఎంపీ హాజరవుతారని తెలిపారు.జులై 20న ఫైనల పోటీలు జరుగుతాయని గెలుపొందిన వారికి 20 తేదీ మధ్యాహ్నం బహుమతి ప్రధానోత్సవం ఉంటుందని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారుగా 400 మంది వరకు క్రీడాకారులు హాజరుకానున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్,కో కన్వీనర్ వన్నెల భూమన్న,కోఆర్డినేటర్లు సందీప్,మధుకర్ గౌడ్,మహేష్,ప్రణీత్,నంద కుమార్, పెటా సంగం జిల్లా ప్రెసిడెంట్ భూక్యారమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిఐ చట్టాల పుస్తకం అందజేత ..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ ఆర్‌డివో కార్యాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పిఐఒ)అయిన ఏ.ఓ కు ఆర్‌టిఐ,చట్టాల పుస్తకాన్ని అందజేశారు.ఈ కార్యక్రమాన్ని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ హైదర్,నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.వినోద్,వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ సాదిక్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ,సమాచార హక్కు చట్టం సామాన్యుడికి బ్రహ్మాస్త్రం లాంటిదని,ఇది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఉద్ఘాటించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకతను పెంచడంలో ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని వారు తెలిపారు.ఆర్‌టిఐ చట్టంపై అవగాహన కల్పించడం,దాని అమలును పర్యవేక్షించడం తమ కమిటీ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సహ చట్ట హక్కు పరిరక్షణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.